క్లుప్తంగా

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



పార్వతీ కల్యాణంపై హరికథ వినిపిస్తున్న కళాకారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళావేదికపై కర్నూలుకు చెందిన డి.లక్ష్మి మహేష్ వారు పార్వతీకల్యాణంపై హరికథ వినిపించారు. ప్రకాశం జిల్లా చీమకుర్తికి చెందిన టి.బాలయోగి, బృందం భక్తి రంజని కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా కార్యక్రమాలు పలువురు భక్తులను అలరించాయి.

ఈఓఆర్డీగా శ్రీనివాసశర్మ

శిరివెళ్ల: స్థానిక ఈఓఆర్డీగా శ్రీనివాసశర్మ నియమితులయ్యారు. అలాగే ఎంపీడీఓ కార్యాలయ ఏఓగా రాజశేఖర్, సచివాలయం-2 వీఆర్వోగా వెంకట సుబ్బయ్య, గుండంపాడు వీఆర్వోగా వీరభద్రుడిని నియమిస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం

బండిఆత్మకూరు: మండలంలోని జీసీ పాలెం గ్రామానికి చెందిన ఈశ్వరయ్య వద్ద నుంచి మద్యం బాటిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ జగన్‌మోహన్ తెలిపిన వివరాలు..మద్యం విక్రయిస్తున్నాడనే సమాచారంతో ఎస్ఐ తన సిబ్బందితో వెళ్లి సోదాలు నిర్వహించారు. ఈశ్వరయ్య వద్ద 12 మద్యం బాటిళ్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు.

ప్రజాసమస్యల పరిష్కార వేదిక రద్దు

బండిఆత్మకూరు: తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం జరగాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని తహసీల్దార్ ధోనీ ఆల్‌ఫ్రెడ్ సెలవులో ఉండటంతో రద్దు అయ్యింది. ముందస్తు సమాచారం లేకపోవడంతో పలువురు తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి వెనుదిరిగారు. కాగా బండిఆత్మకూరు డిప్యూటీ తహసీల్దార్‌గా గురునాథం సోమవారం బాధ్యతలు స్వీకరించారు.

బీజేపీ సభ్యత్వ నమోదు

ఆత్మకూరు: శ్రీశైలం నియోజకవర్గంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యురాలు, మైనార్టీ మోర్చా నియోజకవర్గ కో ఆర్డినేటర్ మోమిన్ షబానా ఆధ్వర్యంలో కొనసాగుతోంది. సోమవారం బైర్లూటి గ్రామంలోని ముర్తుజావలి సాహెబ్ దర్గా వద్ద చెంచు గిరిజనులతోపాటు, ఆత్మకూరు పట్టణ, మండలానికి చెందిన ముస్లింలతో సభ్యత్వం తీసుకున్నారు.

ఎవరైనా టెండర్ వేయొచ్చు

జూపాడుబంగ్లా/పగిడ్యాల: భారతదేశ పౌరులెవరైనా ఏపీ మద్యం దుకాణాలకు టెండర్ వేయవచ్చని ఎక్సైజ్, ప్రొహిబిషన్ నందికొట్కూరు సీఐ రామాంజనేయులు తెలిపారు. సోమవారం ఆయన జూపాడుబంగ్లా, పగిడ్యాల పోలీసుస్టేషన్లను తనిఖీ చేశారు. ఆయా చోట్ల సీఐ మాట్లాడుతూ దరఖాస్తుకు రూ.2 లక్షల చొప్పున 100 దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లు లేకుండా ఆన్‌లైన్‌లో, లేదా నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఎవరైనా బెదిరింపులకు పాల్పడితే తమకు తెలియజేస్తే దరఖాస్తు దారులకు రక్షణ కల్పిస్తామన్నారు. ప్రస్తుతం జూపాడుబంగ్లాకు కేటాయించి మద్యం దుకాణానికి 7, పగిడ్యాలకు 1, నందికొట్కూరు 8, మిడుతూరు 2 చొప్పున దరఖాస్తులు వచ్చినట్లు సీఐ తెలిపారు.

మద్యం దుకాణాలకు ఆహ్వానం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలం మండలం సున్నిపెంట గ్రామంలో ప్రభుత్వం కేటాయించిన రెండు మద్యం దుకాణాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆత్మకూరు ఎక్సైజ్ శాఖ సీఐ కిషోర్‌కుమార్ తెలిపారు. సోమవారం సున్నిపెంట పోలీసు ఔట్‌పోస్టులో ఆయన మాట్లాడుతూ ఆసక్తి ఉన్న వారు ఎలాంటి అపోహలకు గురికాకుండా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

తెలుగు ఉపాధ్యాయుడి మృతి



జి.మహేష్ (ఫైల్)

మిడుతూరు: ఓ ప్రైవేటు హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ కోలుకోలేక తెలుగు పండిట్ మృతిచెందిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. సహచర ఉపాధ్యాయులు తెలిపిన వివరాలు.. కోడుమూడూరు మండలం ఎర్రదొడ్డి గ్రామానికి చెందిన జి.మహేష్ (50) మిడుతూరు మండలం వీపనగండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. మూడు రోజుల క్రితం కర్నూలులోని ఓ ప్రైవేటు హాస్పిటల్‌లో హార్ట్ బైపాస్ సర్జరీ నిమిత్తం చేరాడు. సర్జరీ అనంతరం కోలుకోలేక మృతిచెందాడు. మృతుడికి భార్య చంద్రకళ, ఇద్దరు కుమారులు ఉన్నారు. మహేష్ మరణవార్త తెలియడంతో పాఠశాల హెచ్ఎం రవికుమార్, సహచర ఉపాధ్యాయులు, గ్రామస్తులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. దేవనకొండ మండలం వెంకటాపురం, వీపనగండ్ల ప్రాథమికోన్నత పాఠశాల లు హైస్కూళ్లుగా ప్రమోషన్ పొందేందుకు అతడు చేసిన కృషిని ఉపాధ్యాయులు, ఆయా గ్రామాల ప్రజలు గుర్తు చేసుకుంటున్నారు.

ఆరడుగుల నేల కరువాయే..

- శ్మశాన వాటికల్లేక ఇబ్బందుల్లో ప్రజలు
- నివాసగృహాల మధ్య, చెరువులు, కాల్వగట్లపైనే అంత్యక్రియలు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

బతికినన్ని రోజులు ఏదో ఒక సమస్యతో బాధ పడే మనిషికి.. చనిపోయిన రోజు కూడా ప్రశాంతత లేదు. మృతదేహాన్ని పూడ్చి పెట్టేందుకు కనీసం ఆరడుగుల జాగ కల్పించలేని ప్రభుత్వాలను చూసి ఆత్మలు కూడా బాధ పడుతున్నాయి. శ్మశానవాటికలు లేకపోవడంతో తమ ఆత్మీయుల మృతదేహాలకు కాల్వల గట్లు, రహదారుల వెంట అంత్యక్రియలు నిర్వహిస్తుండటంతో మరోవైపు బంధువులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. – జూపాడుబంగ్లా



శ్మశానవాటికకు స్థలం కేటాయించాలని ఆందోళన చేస్తున్న 80బన్నూరు గ్రామ దళితులు(ఫైల్)

నందికొట్కూరు నియోజకవర్గంలోని జూపాడుబంగ్లా, నందికొట్కూరు, మిడుతూరు, పగిడ్యాల, పాములపాడు, కొత్తపల్లి మండలాల పరిధిలో 77 గ్రామ పంచాయతీలుండగా 91,652 కుటుంబాలలో 2,72,091 మంది జనాభా జీవిస్తున్నారు. ఆయా గ్రామాల్లో గ్రామాల్లో కనీస మౌలిక సదుపాయాలు కల్పించకపోవటంతోపాటు కొన్ని గ్రామాల్లో శ్మశానవాటికల్లేక మృతదేహాలను ఎక్కడ ఖననం చేయాలో అర్థంకాక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. శ్మశానవాటికలను ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు అనేక పర్యాయాలు, ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకున్న పాపానపోలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో శ్మశానవాటిల్లేని గ్రామాల్లో స్థలాలను సేకరించాలని రెవెన్యూ అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. ఈ ఉత్తర్వులు కార్యరూపం దాల్చేలోపే ప్రభుత్వం మారిపోవటం దురదృష్టకరమని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నియోజకవర్గంలోశ్మశానవాటికల్లేని గ్రామాలు

- జూపాడుబంగ్లా మండలంలో 12 గ్రామపంచాయతీలుండగా అందులో భాస్కరాపురం, పోతులపాడు, పారుమంచాల, జూపాడుబంగ్లా గ్రామాల్లో శ్మశానవాటికలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.
- పారుమంచాల గ్రామంలోని దళితులకు శ్మశానవాటిక లేకపోవటంతో నివాసగృహాల మధ్యే మృతదేహాలను ఖననం చేస్తున్నారు. 80 బన్నూరులో దళితులకు శ్మశానవాటిక కల్పించాలని 8 మాసాలుగా ఆందోళనలు చేస్తున్నారు.
- పారుమంచాల గ్రామంలో ఇళ్ల మధ్యన ఉన్న శ్మశానవాటికలో అంత్యక్రియలు చేసుకుంటున్నారు. భాస్కరాపురం, జూపాడుబంగ్లాలో కేసీ కాల్వ గట్టు వెంట, పోతులపాడు, తర్తూరు గ్రామాల్లో చెరువులు, కుంటల్లో అంత్యక్రియలు చేస్తున్నారు.
- మిడుతూరు, తలముడిపి, కడుమూరు, చెరుకుచెర్ల, చౌట్కూరు గ్రామాల్లో శ్మశానవాటికల్లేక ప్రజలు మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహించేందుకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.
- పగిడ్యాల మండలంలోని కొత్తముచ్చుమర్రి, నెహ్రూనగర్, బీరవోలు గ్రామాల్లో శ్మశానవాటికల్లేక కేసీ కాల్వ గట్టు వెంట ఉన్న స్థలంలో అంత్యక్రియలు నిర్వహించుకుంటున్నారు.



పారుమంచాల గ్రామంలో నివాసగృహాల మధ్య ఉన్న శ్మశానవాటిక

- నందికొట్కూరు మండలంలోని నాగటూరు గ్రామంలో శ్మశానవాటిక ఆక్రమణకు గురికావటంతో అంత్యక్రియలు నిర్వహించుకునేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.
- పాములపాడు మండలంలోని కృష్ణరావుపేట, మిట్టకందాల గ్రామాలతోపాటు మరికొన్ని గ్రామాల్లో శ్మశానవాటికల్లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

శ్మశానవాటికకు స్థలం కేటాయించాలి



40 ఏళ్ల నుంచి జూపాడుబంగ్లాలో శ్మశానవాటికకు స్థలం లేదు. చనిపోయిన వారికి ఎక్కడ అంత్యక్రియలు నిర్వహించాలో అర్థంగాక ఊరికి సమీపంలో ఉన్న కర్నూలు–కడప కాల్వ గట్టు వెంట మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహిస్తున్నాం. స్థలం చాలక ఒకరి గుంతలో మరొకర్ని పూడ్చాల్సిన దుస్థితి నెలకొంది. అధికారులు స్పందించి శ్మశానవాటికకు స్థలం కేటాయించాలి. – తిరుపాలు, జూపాడుబంగ్లా

స్థలాలను పరిశీలిస్తున్నాం



సమస్యాత్మకంగా మారిన 80బన్నూరు దళితుల శ్మశానవాటికతోపాటు శ్మశానవాటికల్లేని మరికొన్ని గ్రామాలను గుర్తించి స్థలాల కేటాయింపునకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తాం. వాటిని అధికారులకు పంపి వారి ఆదేశాలతో స్థలాలను కేటాయించేందుకు యత్నిస్తున్నాం. ఏ గ్రామంలోనైనా సమస్యాత్మకంగా ఉంటే వాటిని ఆయా గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు లిఖితపూర్వకంగా మా దృష్టికి తెస్తే పరిశీలించి పరిష్కరించేందుకు యత్నిస్తాం.
– చంద్రశేఖర్‌నాయక్, తహసీల్దార్, జూపాడుబంగ్లా

అనుమతులు లేకుండా బోట్లు నడపొద్దు



సాక్షి ఎఫెక్ట్

పగిడ్యాల: ప్రభుత్వ అనుమతులు లేకుండా కృష్ణా బ్యాక్‌వాటర్‌లో బోట్లు నడపొద్దని నందికొట్కూరు రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం హెచ్చరించారు. బ్యాక్‌వాటర్ మీదుగా తెలంగాణ రాష్ట్రం చెల్లపాడు, మంచాలకట్ట గ్రామాలకు ఇంజిన్ బోట్ల ద్వారా యథేచ్ఛగా ప్రయాణికులను తరిస్తున్నారని సోమవారం ‘సాక్షి’లో ప్రచురితమైన కథనానికి సీఐ స్పందించారు.అర్లపాడు, మూర్వకొండ ఘాట్‌లను క్విక్ టీమ్ బృందంతో వెళ్లి పరిశీలించారు. ఇంజిన్ బోట్ల ద్వారా తెలంగాణకు ప్రయాణికులను తరలిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని ఘాట్ నిర్వాహకులను హెచ్చరించారు. బ్యాక్‌వాటర్‌లో ఇంజిన్ బోట్లు నడిపేందుకు తప్పనిసరిగా ప్రభుత్వ అనుమతి తీసుకోవాలని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే బోట్లను సీజ్ చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఘాట్ నిర్వాహకులు నలుగురిని బైండోవర్ చేసి తహసీల్దార్ ఎదుట హాజరు పరిచినట్లు సీఐ తెలిపారు. సీఐ వెంట ముచ్చుమర్రి ఎస్ఐ సి.శరత్‌కుమార్‌రెడ్డి ఉన్నారు.

ఉపాధి నిధుల మంజూరు

జూపాడుబంగ్లా: మండలంలోని మండ్లెం, తూడిచెర్ల, జూపాడుబంగ్లా, తాటిపాడు, పారుమంచాల గ్రామాలకు రూ.2.55 కోట్ల ఉపాధి హామీ పథకం నిధులు మంజూరయ్యాయి. మిగిలిన గ్రామాలకు మొండిచేయి చూపడంతో ఆయనా గ్రామాల సర్పంచ్‌లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



నందికొట్కూరులో మహాచండీదేవి అలంకారం లో భక్తులకు దర్శనం ఇచ్చిన అమ్మవారు



కొత్తపల్లి: లలితాదేవి అలంకారంలో కొలనుభారతిదేవి అమ్మవారు



మిడుతూరులో స్కందమాత అలంకరణలో అమ్మవారు

భక్తిశ్రద్ధలతో దేవీశరన్నవరాత్రులు



మహానంది: స్కందమాత అలంకారంలో అమ్మవారు



తాటిపాడు గ్రామంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు



బండిఆత్మకూరు: ప్రత్యేక అలంకారంలో అమ్మవారు



ఆత్మకూరులో అన్నపూర్ణాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న అమ్మవారు

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. సోమవారం నందికొట్కూరు, శ్రీశైలం నియోజకవర్గాల్లో అమ్మవార్లను వివిధ రూపాల్లో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఉదయం సర్వతోభద్ర హోమం, కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం జపాలు, షోడసోపచార పూజ, స్వస్తి, హారతితో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. కాగా నందికొట్కూరులోని కన్యకా పరమేశ్వర ఆలయంలో మహాచండీదేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. కొత్తపల్లి మండలంలోని కొలనుభారతిదేవి క్షేత్రం, సంగమేశ్వరంలోని ఉమామహేశ్వరాలయంలో అమ్మవార్లు లలితాదేవిగా, పాములపాడులో చాముండేశ్వరిదేవిగా, జూపాడుబంగ్లాలో పార్వతీదేవిగా, క్వార్టర్స్‌కాలనీలో శ్రీలలితా త్రిపుర సుందరీదేవిగా, మిడుతూరులో స్కందమాతగా భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే ఆత్మకూరులో అన్నపూర్ణాదేవిగా, బండిఆత్మకూరు మండలంలోని గంగ ఉమా సమేత ఓంకారేశ్వరాలయంలో అమ్మవారు కామాక్షి దేవిగా కటాక్షించారు. – సాక్షి నెట్‌వర్క్



పాములపాడు ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

సంక్షిప్తం

సమస్యలు పరిష్కరించండి

కొత్తపల్లి: ప్రజలు సమస్యలను ఎప్పటికప్పుడే పరిష్కరించాలని తహసీల్దార్ ఉమారాణి సూచించారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా తన కార్యాలయంలో మండల అధికారులతో కలిసి ఆమె ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వివిధ సమస్యలపై 6 దరఖాస్తులు రాగా వీటినంత త్వరగా పరిష్కరిస్తామని బాధితులకు హామీ ఇచ్చారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా దరఖాస్తులను పరిశీలించి త్వరగా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు.

వీధిలైట్లు ఏర్పాటు చేయండి

పాములపాడు: వీధి లైట్లు ఏర్పాటు చేయాలని బానుముక్కల గ్రామ మాజీ సర్పంచు బాలునాయక్ సోమవారం ఎంపీడీఓ చంద్రశేఖర్‌కు వినతి పత్రం అందజేశారు. రెండు నెలల క్రితం జరిగిన గ్రామ సభ దృష్టికి తీసుకెళ్లినా ఇంత వరకు వీధి లైట్లు ఏర్పాటు చేయలేదని ఆయన ఫిర్యాదు చేశారు. మండల కేంద్రంలో వర్షపు నీరు వీధుల్లో నిలిచి పారిశుధ్యం లోపిస్తోందని స్థానికొడుకరు ఎంపీడీఓకు అర్జీ ఇచ్చారు.

సేవలకు గుర్తింపు

నందికొట్కూరు: తాను చేసిన సేవా కార్యక్రమాలను గుర్తించి హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ ఆల్ ఇండియా సంస్థ బెస్ట్ సర్వీస్ అవార్డుతో సత్కరించిందని ఆర్ట్ దేశెట్టి శ్రీనివాసులు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఇరవై ఏళ్లుగా అనాథలకు అన్నదానాలు, రక్తదానం చేస్తుండటంతో సంస్థ అధ్యక్షులు అయ్యప్ప, వర్కింగ్ ప్రెసిడెంట్ రాజు, ఉపాధ్యక్షులు ప్రయణ్‌రెడ్డి, కార్తీక్, మల్లిక ఆదివారం విజయవాడలోని బందర్ రోడ్‌లోని కాకాని భవనంలో అవార్డు అందజేశారన్నారు.

పంట రుణాలు ఇవ్వాలి

ఆత్మకూరు: కౌలు రైతులకు పంట రుణాలను అందించాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్.మార్క్, జిల్లా ఉపాధ్యక్షులు డి.సోమన్న, ఎం.శేఖర్ సోమవారం ఎస్‌బీఐ మేనేజర్‌ను కోరారు. రబీ సీజన్ ప్రారంభం కావడంతో రైతులు పంటలను సాగుచేసేందుకు సన్నద్ధమవుతున్నారని, ప్రస్తుతం రైతులు అప్పుల కోసం ప్రైవేట్ వ్యక్తులను ఆశ్రయించి మోసపోయే ప్రమాదం ఉందని, రుణాలిచ్చి ఆదుకోవాలని వారు మేనేజర్‌కు వినతి పత్రం అందజేశారు.

శనగ విత్తనాలకు పేర్లు నమోదు చేయించుకోండి

పాములపాడు: ప్రభుత్వం నుంచి మంజూరయ్యే శనగ విత్తనాల కోసం పేర్లు నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి ఫణీశ్వరరెడ్డి రైతులకు సూచించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు, మొబైల్ నెంబరుతో రైతు సేవా కేంద్రంలో సంప్రదించి పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు.

అధికారులు హాజరుకావాలి

పాములపాడు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించనున్న పబ్లిక్ గ్రీవెన్స్ డేకు అన్ని శాఖల మండల స్థాయి అధికారులు, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు తప్పనిసరిగా హాజరుకావాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ సూచించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ సమావేశానికి ఎమ్మెల్యే గిత్తా జయసూర్య హాజరై ప్రజల సమస్యలపై చర్చిస్తారన్నారు.

ఆత్మకూరును పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతాం

ఆత్మకూరు: ఆత్మకూరు ప్రాంతాన్ని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం నాగలూటి చెంచుగూడెంలో గిరిజనులకు టార్పాలిన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన గూడేల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. గిరిజనులు అనారోగ్యానికి గురైతే సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్సలు చేయించుకోవాలన్నారు. అనంతరం 93 కుటుంబాలకు టార్పాలిన్లు అందించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ ప్రత్యేకాధికారి కె.నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

బాలికల సౌత్ జోన్ ఇండియా లీగ్ మ్యాచ్‌కు ఆత్మకూరు విద్యార్థిని

ఆత్మకూరు: పట్టణంలోని శ్రీ పద్మావతి హైస్కూల్ 7వ తరగతి విద్యార్థిని ఎస్.హారిక సౌత్ జోన్ ఇండియా లీగ్ మ్యాచ్‌కు ఎంపికైనట్లు స్కూల్ మేనేజింగ్ డైరెక్టర్ పి.ఆశ తెలిపారు. సోమవారం పాఠశాలలో విద్యార్థిని అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత నెల 5న ఒంగోలులో నిర్వహించిన రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన తమ విద్యార్థిని హారిక ఈనెల 16, 17వ తేదీల్లో తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూరులో జరగనున్న జాతీయస్థాయి ఖోఖో పోటీల్లో పాల్గొంటారన్నారు.

నవ్విపోదురుగాక.. నాకేటి సిగ్గు!

పట్టపగలు.. నట్టి నడి బజార్లో.. చుట్టూ జనం చూసి చీదరించుకున్నా.. నాకేటి సిగ్గు అనే రీతిలో ఓ వ్యక్తి మద్యం తాగుతూ తన లోకంలో మునిగిపోయాడు. ఈ దృశ్యం నందికొట్కూరు పాత బస్టాండ్ వద్ద సోమవారం కనిపించింది. అసలే నంత రోజు కావడం.. పండగ సరుకులు కొనుగోలు నిమిత్తం పల్లెటూళ్ల నుంచి ప్రజల రాకతో ఆ ప్రాంతం రద్దీగా ఉంది. అయినా గ్లాసు నిండుగా మద్యం పోసుకుని, పక్కనే ఎగ్గు బోండం పెట్టుకుని గుటుకు గుటుకు తాగుతూ.. గుడ్డును గుటుక్కు మనిపిస్తూ ఆనందంలో మునిగిపోయాడు. కాగా బహిరంగ ప్రదేశాల్లో మద్యం తగకూడదనే విషయం అతడికి తెలియకపోయినా వారించాల్సిన పోలీసులు చూసీచూడట్లు వదిలేయడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



ఇలాంటి వారిని చూసి యువత ఏమై పోవాలని, టీడీపీ ప్రభుత్వ వచ్చిన తర్వాత మద్యం ఏరులై పారుతుందని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. – నందికొట్కూరు

ముక్కంటి సన్నిధిలో దసరా సందడి

- మల్లికార్జున స్వామి దర్శనానికి పోటెత్తిన భక్తజనం



మల్లన్న దర్శనానికి బారులు తీరిన భక్తులు



మహానందిలో పూజలు నిర్వహిస్తున్న దృశ్యం



శ్రీశైలంలో అమ్మవారిని పుష్పాలతో అలంకరించిన దృశ్యం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో వెలసిన ముక్కంటీశ్వరుడి దర్శనానికి భక్తులు పోటెత్తారు. దసరా ఉత్సవాల్లో భాగంగా సోమవారం పరమేశ్వరుడికి ప్రీతికరమైన రోజు కావడంతో ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే గాకుండా ఇతర రాష్ట్రాల నుంచి సైతం భక్తులు వేలాదిగా తరలివచ్చారు. పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించి మల్లన్న దర్శనానికి క్యూకట్టారు. ఉచిత, శీఘ్ర, అతిశీఘ్ర దర్శన క్యూలైన్ల ద్వారా స్వామిఅమ్మవార్లను దర్శించుకున్నారు. కాగా దసరా ఉత్సవాలను పురస్కరించుకుని శ్రీగిరి క్షేత్రాన్ని పుష్పాలతో సుందరంగా అలంకరించారు.

మహానందిలో..

మహానంది: దసరా నవరాత్రి ఉత్సవాలతోపాటు సోమవారం కావడంతో మహానంది ఆలయం భక్తులతో కళకళలాడింది. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు వివిధ ప్రాంతాలకు చెందిన వేలాది భక్తులు తరలివచ్చి కోనేరులలో పుణ్య స్నానాలు ఆచరించి కామేశ్వరిదేవి సహిత మహానందీశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి, ఆధ్వర్యంలో వేద పండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర్ అవధాని, ఋత్వికులు, పండితులు స్థానిక శత చండీ యాగశాలలో రుద్ర, చండీ హోమాలు వైభవంగా నిర్వహించారు. భక్తులు రూ.13,116 చెల్లించి ఉభయ దాతలుగా పూజలో పాల్గొన్నారు. అలాగే ఆలయ అభివృద్ధికి నంద్యాల రావూస్ కళాశాల వ్యవస్థాపకులు ఏఎంపీ అప్పారావు రూ.లక్ష, అన్నదాన పథకానికి పారుమంచాల గ్రామానికి చెందిన మండడి సుధాకర్ రెడ్డి, శ్రీలక్ష్మమ్మ కుటుంబ సభ్యులు రూ.50,000 విరాళమిచ్చారు. కాగా రాత్రి కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వర దంపతులకు సహస్ర దీపాలంకరణ పూజలను వైభంగా నిర్వహించారు.